అలరించిన సంగీత విభావరి

పాత గుంటూరు: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకొని అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకులు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం ఘంటసాల మధుర గీతాల గానామృతం ప్రేక్షకులను అలరించింది. గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్, చీకటి రవికాంత్, రజని, దొప్పలపూడి శ్రీనివాస్, హేమామాలిని ఘంటసాల గీతాలను ఆలపించారు. అనంతరం శారదా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. భారతి వాణికి ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో సేవా సదన్ అధ్యక్షుడు గోపీకుమార్, విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, కాపునాడు నాయకులు బొందలపాటి వెంకటరావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, రాగం సదాశివరావు, దళవాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఏవీకే సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

చందూస్ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): 27వ చందూస్ కప్ క్రికెట్ పోటీల్ని శనివారం స్థానిక జేకేసీ క్రికెట్ మైదానంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేకేసీ కళాశాల మొదటి నుంచి క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఉమెన్స్ క్రికెట్ రాష్ట్రానికి రావడంలో దివంగత జాగర్లమూడి నరేంద్రనాథ్ ఎంతో కృషి చేసినట్లు గుర్తించారు. అధ్యాపకుల కోసం నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో వారంతా క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని చెప్పారు. కార్యక్రమంలో జాగర్లమూడి మురళీ మోహన్, కుప్పుస్వామి, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో వివిధ జట్లు పోటీపడ్డాయి.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై ఎనిమిది కలిసి దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో శుక్రవారం రాత్రి ఇటుకలపాటి నాగరాజు ఇంటికి వెళుతుండగా, లక్ష్మీ నారాయణ, పవన్‌కుమార్, దుర్గారావు, మరో ఐదుగురు దాడిచేసి గాయపరిచారు. ఈ మేరకు నాగరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గాయకులకు పురస్కారాలు

పాత గుంటూరు: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం రింగురోడ్డులోని శిల్పారామంలో విశిష్ట గాయకులకు స్వర రత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కళా దర్బార్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు పొత్తూరి రంగారావు శనివారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఘంటసాల గానామృతం పేరుతో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నాజ్ సెంటర్లోని ఘంటసాల విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఘంటసాల కృష్ణకుమారి పాల్గొంటారని తెలిపారు.

• **పాత గుంటూరు:** బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై రామరాజు ఫౌండేషన్, వాగ్దేవి సంగీత నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న తొమ్మిది మంది వీణ విద్వాంసులతో కచేరీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ తెలిపారు.